క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతుల శిక్షణలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

చీపురుపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు సంబంధించి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని అలజంగి రైతుసేవా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ కె.భారతి, మండల వ్యవసాయాధికారి ఎస్.సూర్యకుమారి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాధికారి కె.గోవిందమ్మ హాజరై మాట్లాడారు. నారు యాజమాన్యంతో పాటు మొక్కజొన్న పంటలో ఎరువుల యాజమాన్యం, సస్య రక్షణపై అవగాహన ఉండాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు భూమికి మేలు చేస్తాయని చెప్పారు. విత్తనశుద్ధి చేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

గుర్ల: మండల కేంద్రంలోని బీవీఆర్ కల్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న అధ్యాపకులు తమ సర్వీస్‌ను రెన్యువల్ చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణాజీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2025 - 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంట్రాక్ట్ అధ్యాపకులు రెన్యువల్ కోసం ఐడెంటిఫైడ్ (ఐడీ) కళాశాలగా ఉన్న చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. 2024 - 25 విద్యా సంవత్సరంలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. అధ్యాపకులు ఈ నెల 19లోగా వారు పని చేస్తున్న కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, ఆయా కళాశాలల్లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత ప్రిన్సిపాళ్లు ఈ నెల 20న చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమర్పించాలని తెలిపారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

చీపురుపల్లి: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఈ ఏడాది నుంచి ప్రారంభించిన నీట్, ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ చదివేందుకు అర్హత గల విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాణీశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించి ఎస్సీ కేటగిరి చెందిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ ఇంటర్‌లో చేరే విద్యార్థులకు నీట్, ఐఐటీ పరీక్షలకు సిద్ధం చేసే తరహాలో బోధన ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 31లోగా ధ్రువీకరణ పత్రాలతో సహా కళాశాలలో హాజరు కావాలని తెలిపారు.

చెత్త సేకరణపై అవగాహన



చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు

జామి: మండలంలోని అట్టాడ గ్రామాన్ని ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు గురువారం సందర్శించి తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు, గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ పారబోయకుండా అంబాసిడర్లకు అందజేయాలన్నారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఉమా, సర్పంచ్ పి.అమ్మన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న వారందరికీ 'అన్నదాత సుఖీభవ'

గజపతినగరం: అర్హత ఉన్నవారందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి పి. కిరణ్‌కుమార్, తహసీల్దార్ బి.రత్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాల వల్ల ఆధార్, వ్యవసాయ భూమి తప్పుగా లింక్ కావడం వల్ల మండల వ్యాప్తంగా 2,260 మంది రైతులను తహసీల్దార్ లాగిన్‌లో అనర్హులుగా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. వీరందరి వివరాలను వీఆర్‌ఓలు, వ్యవసాయ సహాయకులకు అందజేశామన్నారు. బాధిత రైతులు వెంటనే సచివాలయాల్లో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకుని వీఆర్‌ఓ వద్ద పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్‌లో నమోదు చేసుకుంటే అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.

అక్కడ ఆందోళన - ఇక్కడ నిరసన



పోలీసుల తీరు పట్ల నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ డ్రామాలో రోజుకో కొత్త అంకం పుట్టుకొస్తోంది. ఇటీవల ఎస్.కోట పోలీసులు సెక్షన్ 30 అమల్లో ఉందని, నిరసనలు, ధర్నాలు, హర్తాళ్లు, ర్యాలీలు, సమ్మెలు ఏమీ చేయకూడదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని హుకుం జారీ చేశారు. ఆంక్షలు మీరితే పోలీస్‌రూల్ చూపిస్తామంటూ సైరన్ మోగించారు. అయితే శాంతియుత నిరసన కార్యక్రమాలకు అనుమతించమని అడిగిన జిందాల్ నిర్వాసితులకు 'నో థాన్స్' అంటూ చెప్పి రోడ్డు ఎక్కకుండా నిలువరించారు. గురువారం ఒక్కసారిగా ఎక్కడెక్కడి నుంచో వందల సంఖ్యలో యువత నేరుగా జిందాల్ కార్యాలయం వద్దకు వచ్చి ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలి.. ఉద్యోగాలు ఇవ్వాలని ఆందోళన చేస్తే ఎస్.కోట పోలీసులు డ్రామా చూపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పుడు సెక్షన్ 30 ఎత్తేశారా.. పోలీస్‌రూల్ కంపెనీకి అమ్మేశారా...అంటూ సోషల్‌మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బొడ్డవర వద్ద ఆందోళన..

బొడ్డవర వద్ద ఉన్న జిందాల్ కార్యాలయం వద్ద గురువారం కూటమి సానుభూతిపరులు కొంత మంది యువకుల్ని, స్థానికంగా ఉన్న కొన్ని కళాశాలల విద్యార్థులను పోగేసి ఆందోళనకు దిగారు. తక్షణం ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలి.. మాకు ఉద్యోగాలు ఇవ్వాలి.. జిల్లాను అభివృద్ధిపథంలో నిలపాలి అంటూ నినాదాలు చేశారు. అక్కడకు కొద్ది సేపటి తర్వాత పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి పంపించి వేశారు.

జిందాల్ కార్యాలయం వద్ద నిరసన..

జిందాల్ కార్యాలయం వద్ద నిరుద్యోగులు చేసిన ఆందోళన పట్ల జిందాల్ నిర్వాసితులు నిరసన వ్యక్తం చేశారు. 25 రోజులుగా మాకు జీవనోపాధి కల్పించాలని.. పరిహారం ఇవ్వాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే మాపై కేసులు పెట్టిన



జిందాల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న యువతీయువకులు

పోలీసులు, వారికి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. మాకో న్యాయం.. వారికో న్యాయమా అని ప్రశ్నించారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం



చీపురుపల్లి: సత్కారం అందుకున్న ఉద్యోగులతో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు



గుర్ల: హెచ్‌ఎం పైడితల్లిని సత్కరిస్తున్న ఆర్మీ మాజీ ఉద్యోగి అప్పారావు, గ్రామస్తులు

చీపురుపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ ఎంతో గొప్పదని.. అందులో పనిచేసే ఉద్యోగులు కూడా ప్రజలకు చక్కని సేవలు అందించారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతరం అన్నారు. మండలంలోని రామలింగాపురం గ్రామ సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన పలువురు ఉద్యోగులను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సేవలు అందించిన ఘనత గ్రామ సచివాలయ ఉద్యోగులకే దక్కిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని వ్యవస్థను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అయితే బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు ఎక్కడైనా మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, గ్రామ పెద్దలు ఇప్పిలి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు..

గుర్ల: మండలంలోని కెల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన హెచ్‌ఎం పైడితల్లితో పాటు మరో ఎనిమిది మంది ఉపాధ్యాయులకు వేరే ప్రాంతాలకు బదిలీ జరిగింది. దీంతో బదిలీ ఉపాధ్యాయులను గ్రామానికి చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి సారిక అప్పారావు ఆధ్వర్యంలో గురువారం తస్కరించారు. ఈ సందర్భంగా సారిక అప్పారావు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.లీలాకుమారి, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయండి



బీఎల్‌ఓలు శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ ధర్మరాజు

చీపురుపల్లి: క్షేత్ర స్థాయిలో సమర్థవంతమైన ఓటర్ల జాబితాలు సిద్ధం చేయడంలో బీఎల్‌ఓలు ప్రధాన పాత్ర పోషించాలని తహసీల్దార్ డి.ధర్మరాజు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బీఎల్‌ఓలకు కొద్ది రోజులుగా ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి లోపాల్లేని ఓటర్ల జాబితాలు రూపొందించినప్పుడే ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ సాధ్యపడుతుందన్నారు. అనర్హులను జాబితా నుంచి తొలగిస్తూ.. అర్హత ఉన్నవారికి ఓటుహక్కు కల్పించాలన్నారు. అలాగే 1200 మంది ఓటర్లు దాటి ఉన్న పోలింగ్ బూత్‌ల స్థానంలో ఓటర్లను వేరు చేసి కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పిస్తోందన్నారు. ఈ విషయంలో స్థానికంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్షవర్థిని, గుర్ల డిప్యూటీ తహసీల్దార్ వి.నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చండి మహాప్రభో..



పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న గ్రామస్తులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడై సుమారు నెల రోజులు కావొస్తున్నా ఇంతవరకూ ఎవ్వరూ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పాడవ్వడంతో గ్రామానికి సక్రమంగా విద్యుత్ సరఫరా జరగడం లేదని వాపోతున్నారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ పాడైన విషయాన్ని లైన్‌మన్‌కు తెలియజేసినప్పటికీ స్పందించలేదని.. తర్వాత ఏఈకి కూడా తెలియజేసినా ఫలితం లేకపోయిందని చెప్పారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అధికారులు స్పందించకుంటే కలెక్టర్‌కు, ఏపీఎస్ఈపీడీసీఎల్ సీఎండీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రతి రైతుకూ ఎరువు అందిస్తాం..

- జిల్లా మార్క్‌ఫెడ్ జీఎం వెంకటేశ్వరరావు



మెరకముడిదాంలో పీఏసీఎస్ గొడౌన్‌లో ఉన్న ఎరువులను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ జీఎం వెంకటేశ్వరరావు

మెరకముడిదాం: వ్యవసాయం చేసే ప్రతి రైతుకూ ఎరువులను అందిస్తామని, రైతులు ఎలాంటి ఇబ్బంది పడొద్దని జిల్లా మార్కెఫెడ్ డీఎం ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని చినబంటుపల్లి, మెరకముడిదాం పీఏసీఎస్‌లను సందర్శించి, ఎరువు నిల్వలను పరిశీలించారు. అనంతరం గర్భాం-2 రైతుభరోసా కేంద్రంలో ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రైతులకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా, అలాగే పీఏసీఎస్‌ల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్ద ఎరువులు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి



జాకేరులో వెల్‌నెస్ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ సూచించారు. మండలంలోని జాకేరు గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అంబాసిడర్లకు అందజేయలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్ల: మండలంలోని నాగళ్లవలస, గుర్ల సబ్ స్టేషన్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టడం వల్ల పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నారంనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జమ్ము, సదానందపురం, గోలగాం, తాటిపూడి, గరిడ, వల్లాపురం, శేషపుపేట, చిన్న నాగళ్లవలస , పల్లిగండ్రేడు, బూర్లిపేట, పకీరుకిత్తలి, కొండగండ్రేడు, బొత్సపేట, వల్లపేట, గొల్లలపేట, మునకాల పేట, ముద్దాడ పేట, కోటగండేడ్రు, కలవచర్ల, గరికివలస, పాలవలస, గూడెం, నక్కలపేట, పున్నపురెడ్డిపేట.. గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామానికి సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్కవరపుకోటలో..

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఖాసాపేట 11 కేవీ రూరల్ ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఏఈ సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాసాపేట, కొట్యాడ, ఎల్.కోట తలారి, రెల్లిపేట, కూర్మవరం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెనూ తప్పనిసరి



బక్కునాయుడుపేటలో రాగిజావను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో పరిశుభ్రత పాటిస్తూ రుచికరమైన మెనూ అమలు చేయాలని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. మండలంలోని బక్కునాయుడుపేట, పెదగుడిపాల ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

అవంతీ కళాశాలలో ఎంసీఏ కోర్సు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలో గల అవంతీ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసీఏ కోర్సు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జె. బాలభాస్కరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ... ఈ నూతన విద్యా సంవత్సరం నుంచి కోర్సు అమల్లోకి తీసుకువస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు అందని ఎరువులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతుసేవా కేంద్రాలకు ఇంతవరకు ఎరువులు రాలేదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ నాయకుడు మహదేవ్ ఫణీంద్రుడు ఇంటి వద్ద జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సొంత నియోజకవర్గంలో రైతులకు ఇంతవరకు ఎరువులు అందకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఉభాలు వేసిన రైతులు ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎరువులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మండల శ్రీను, సర్పంచ్ రంభ చంద్రోఖర్ పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



మన గ్రోమోర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖాధికారులు

గజపతినగరం: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్, వ్యవసాయ శాఖాధికారులు గురువారం తనిఖీ చేశారు. అధికారుల తనిఖీల గురించి తెలుసుకుని పలువురు వ్యాపారులు దుకాణాలు మూసివేయడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణాన్ని వ్యవసాయ శాఖ ఏడీఏ నిర్మలా జ్యోతి, విజిలెన్స్ అధికారి రామారావు, ఏఓ లోకేష్ తనిఖీ చేసి రికార్డులు, బిల్లులు, నిల్వలను పరిశీలించారు. యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు అంటగడుతున్నారనే ఫిర్యాదులు వచ్చాయని అధికారులు చెప్పారు. రైతుకు కావాల్సిన ఎరువులు విక్రయించి రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. మూసివేసిన దుకాణాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

కారంచేడు మృతులకు నివాళులు..



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దళిత ఉద్యమ నేత ఉదయ్‌భాస్కర్

శృంగవరపుకోట: దళితుల ఆత్మగౌరవ పోరాటానికి కారంచేడు సంఘటన కేంద్ర బిందువని దళిత ఉద్యమ నేత ఎ.ఉదయ్‌భాస్కర్ అన్నారు. ఈ మేరకు దేవీ జంక్షన్ గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కారంచేడు మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా కారంచేడులో 1985 జూలై 17న జాతి అహంకారంతో కొందరు దళితులపై జరిపిన మారణకాండలో ఆరుగురు దళితులు మృతి చెందారన్నారు. నాటి కారంచేడు ఉద్యమం దేశ వ్యాప్తంగా వినిపించిందని.. ఈ సంఘటన వల్లే అట్రాసిటీ చట్టం రూపుదిద్దుకుందని చెప్పారు. కార్యక్రమంలో డోల కేశవ, గుర్రపు శ్రీను, బోనెల ఈశ్వరరావు, మెయ్యి వెంకటరమణ, డెంకాడ సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం డోర్ డెలివరీ..!

- మద్యం దుకాణాల నిర్వాహకులే గ్రామాలకు వెళ్లి బెల్ట్‌షాపులకు ఇవ్వడంపై విమర్శలు
- నందుసందునా వెలిసిన బెల్ట్ షాపులు
- చోద్యం చూస్తున్న అధికారులు



బుడతానపల్లి గ్రామంలోని ఓ బెల్ట్ షాపు వద్ద మద్యం విక్రయిస్తున్న వ్యక్తి



మద్యం బాటిళ్లు

గంట్యాడ: డిపార్ట్‌మెంటల్ స్టోర్ నుంచి కిరాణా సామాన్లు డోర్ డెలివరీ చేసినట్లు మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. బెల్ట్‌షాపు నిర్వాహకులు గతంలో మద్యం దుకాణాలు వద్దకు వచ్చి మద్యం తీసుకుని వెళ్లేవారు. ఇప్పుడు మద్యం షాపు నిర్వాహకులే గ్రామాల్లో వెలసిన బెల్ట్ షాపులకు మద్యాన్ని చేరవేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ విషయం ఎక్సైజ్‌శాఖకు తెలిసినా ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గంట్యాడ మండలంలో మద్యం దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పడినట్లు సమాచారం. మద్యం విక్రయాలు పెంచడానికి అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నారు.

మండలంలో మద్యం దుకాణాలు..

మండలంలోని కొటారుబిల్లి జంక్షన్, రావివలస జంక్షన్, నరవ, కొర్లాం, బోనంగి, కొండతామరపల్లిలో మద్యం దుకాణాలు ఉన్నాయి. ఆయా మద్యం దుకాణాల పరిధిలో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. పాన్ షాపుల కంటే ఎక్కువగా బెల్ట్ షాపులే గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. చిన్న గ్రామాల్లో 5 నుంచి 10.. పెద్ద గ్రామాల్లో 15 నుంచి 20 వరకు బెల్ట్ దుకాణాలు వెలిశాయి. దీంతో మద్యం దుకాణదారులు బెల్ట్‌షాపుల నిర్వాహకుల వద్దకే మద్యం తీసుకెళ్లి ఇస్తుండడంతో వారి వ్యాపారం జోరుగా సాగుతోంది.

ప్రకటనలకే పరిమితం..

మద్యం దుకాణాల వద్దే మద్యం కొనుగోలు చేయాలని.. అనధికార దుకాణాల వద్ద మద్యం కొనుగోలు చేయకూడదని ఇటీవల ఎక్సైజ్ శాఖ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. అయితే మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామూళ్ల కోసం ఎక్సైజ్‌శాఖ అధికారులు బెల్ట్ షాపుల జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు కూటమి నేతలు కూడా బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నరనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

బెల్ట్ షాపులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించకూడదు. అలాంటిది బెల్ట్‌షాపులకు మద్యం దుకాణదారులు నేరుగా మద్యం తరలించడం నేరం. ఈ విషయమై దృష్టి సారిస్తాం. బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, ఎక్సైజ్‌శాఖ సీఐ

పేదరిక నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం వెంకటరమణ

- వెలుగు ఏపీఎం వెంకటరమణ

కొత్తవలస: పేదరిక నిర్మూలనలో మహిళలందరూ భాగస్వాములు కావాలని వెలుగు ఏపీఎం ఎ. వెంకటరమణ సూచించారు. గురువారం స్థానిక వెలుగు భవనంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ పేదరికం – నిర్మూలన ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, సీసీలు అప్పలస్వామి, భారతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.